క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే గణబాబు



అప్పన్న ఆలయంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదంతో పాటు శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

రాచపోలమాంబ సతకంపట్టులో పూజలు



విశేష అలంకరణలో రాచపోలమాంబ అమ్మవారు

అల్లిపురం : అల్లిపురం మెయిన్ రోడ్డులో గల శ్రీ రాచపోలమాంబ అమ్మవారి సతకం పట్టు ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మరో రెండు రోజుల పాటు అమ్మవారి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బొట్టా రమేష్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం : చావుల మదుము జంక్షన్‌లో గల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని ఓ పెద్ద కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి కాలువలో పడి వున్నట్లు స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి మృతదేహాన్ని వెలుపలకు తీశారు. వివరాలు తెలిసిన వారు 9440904716, 0891 2783672, 7981674667లో సంప్రదించాలని కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సముద్రాలను కాపాడుకోవాలి

బీచ్‌రోడ్డు: మన సముద్రం మన వాతావరణం కోసం కృషి చెయ్యాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ఫెలోషిప్ ప్రతినిధి ఐ.కృష్ణ కుమారి కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సం సందర్భంగా శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రపంచ వ్యాప్తంగా మహా సముద్రాలను కాపాడుకోవాల్సిన రోజులే అని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఒక్కటే మన భవిష్యత్తు అనే ఆలోచనతో సమష్టిగా కృషి చెయ్యాలన్నారు.

గంగపుత్రులకు బెంగ!

- శిథిలావస్థలో సామాజిక భవనం
- దెబ్బతిన్న ఫ్లాట్ ఫారాలు
- చేపలు ఎండబెట్టుకోవడానికి అవస్థలు
- వేట సామగ్రి భద్రపర్చుకోవడానికి తిప్పలు



విరిగిపోయిన మెట్ల మార్గం



పెచ్చులు ఊడిపోతున్న గచ్చు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో గంగపుత్రుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. నేడో రేపో కూలడానికి సిద్ధంగా ఉంది. 30 ఏళ్ల కిందట తీరం సమీపంలో నిర్మించిన సామాజిక భవనం ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారులకు అనేక విధాలుగా దోహదపడింది. గంగపుత్రులు వేటాడి తెచ్చిన చిరుచేపలను సామాజిక భవనం ప్లాట్ ఫాంపై ఎండబెట్టి అమ్మకాలు సాగించేవారు. తుఫాను వంటి అత్యవసర సమయాల్లో ఇంజిన్లు, వలలను భవనంలో భద్రపర్చుకునేవారు. అయితే సామాజిక భవన నిర్వహణను పట్టించుకోకపోవడంతో శిథిల దశకు చేరింది. భవనం సమీపంలో నిర్మించిన మరో రెండు ప్లాట్‌ఫారాలు కూడా శిథిల దశకు చేరాయి. ప్రస్తుతం సామాజిక భవనం ఫ్లాట్ ఫారం గచ్చులు పూర్తిగా పాడైపోయాయి. శ్లాబు దెబ్బతింది. మెట్ల మార్గం శిథిలమైంది. ఏ మాత్రం వర్షం పడినా కారిపోతుంది. శ్లాబు బీటలు వారడం వల్ల భవనంలోకి వెళ్లడానికి గంగపుత్రులు భయపడుతున్నారు. చిరు చేపలు రోడ్లపై ఎండబెట్టి అమ్మకాలు సాగించాల్సి వస్తుందని మత్స్యకార్మికులు వాపోతున్నారు. సామాజిక భవనం, ఫ్లాట్ ఫారాల మరమ్మతులకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఎండబెట్టిన చేపలు



శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం

ఫ్లాట్ ఫారాలకు మరమ్మతులు చేయాలి

చిరు చేపలు ఎండబెట్టడానికి సరైన ఫ్లాట్ ఫారం లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో నిర్మించిన ఫ్లాట్ ఫారాలు కూడా దెబ్బతిన్నారు. వాటి రిపేర్లు పూర్తి చేయని కారణంగా వేటాడి తెచ్చిన చిరు చేపలు, పూని రెయ్యిగుండను రోడ్లపై ఎండబెట్టుకోవాల్సి వస్తోంది. మా ఇబ్బందులను గుర్తించి సామాజిక భవనంతో పాటు ఫ్లాట్ ఫారాలకు మరమ్మతులు చేపట్టాలి. – సూరాడ ఎల్లమ్మ, ముత్యాలమ్మపాలెం

కొత్త భవనం నిర్మించాలి

వలలు, ఇంజిన్లు భద్రపర్చుకోవడానికి సరైన వసతి లేక తీరం ఒడ్డున వదిలేస్తున్నాం. ఏ సమయంలోనైనా తుఫాన్లు వస్తే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. గతంలో నిర్మించిన సామాజిక భవనం శిథిలమైంది. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. మా ఇబ్బందులను గుర్తించి అదనపు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– సూరాడ మసేను, ముత్యాలమ్మపాలెం

కరెంట్ కోత.. ఉక్కపోత

12 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం



పోలిరెడ్డిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి పరిసర ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల పనులు కోసం శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పవర్ కట్ ఉంటుందని అధికారులు ప్రకటించారు. వాడచీపురుపల్లి ప్రాంతానికి అంతరాయం ఉంటుందని ప్రకటించక పోయినా ఉదయం నుంచి వాడచీపురుపల్లి పరిసర ప్రాంతాలకు సరఫరా నిలిపేశారు. రాత్రి 8.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో వాడచీపురుపల్లి ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం ఉదయం నుంచి చాలా మందికి తాగడానికి మంచినీరు లేక ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరా లేక సెల్ ఫోన్ టవర్లు పని చేయడం మానేశాయి. ఫలితంగా మొబైల్ ఫోన్లు మూగబోయాయి. పన్నెండు గంటల పాటు విద్యుత్ సరఫరా లేక విద్యుత్ వినియోగదారులు పడరాని పాట్లు పడ్డారు. సమస్యను పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి వద్ద ప్రస్తావించగా వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు చెప్పారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఆ స్థానంలో నూతన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యాయని ఏఈ శేషసాయి చెప్పారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం అనంతరం సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

మరిడమ్మ పండగకు వేళాయె

- పొలిమేర దేవతగా పూజలు
- రెండేళ్లకోసారి పెద్ద ఎత్తున పండగ నిర్వహణ
- విస్తృత ఏర్పాట్లు



మరిడమ్మ(సత్తెమ్మ)

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి అయిన మరిడమ్మ(సత్తెమ్మ)పండగను ఆదివారం వైభవంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. రెండేళ్ల కోసారి నిర్వహించే మరిడమ్మ పండగకు ఎంతో ప్రాచుర్యం ఉంది.

ఇదీ నేపథ్యం

పైడితల్లమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, రాసపోలమ్మ, పురటాలమ్మ, పోలమ్మ ఏడుగురు అక్కాచెల్లెళ్లు. వీరిలో మరిడమ్మ గ్రామ పొలిమేర దేవతగా విరాజిల్లుతోంది. గ్రామంలోకి ఎలాంటి క్షుద్రశక్తులు రాకుండా, ప్లేగు, కలరా తదితర అంటు రోగాలు రాకుండా మరిడమ్మ గ్రామ పొలిమేరు వద్ద కాపలాకాస్తుంటుందని గ్రామస్తుల విశ్వాసం. మిగతా అమ్మవార్లపై ఉన్న ఆప్యాయతతో పొలిమేర నుంచి మరిడమ్మ గ్రామంలోకి వచ్చేస్తుంటుంది. అలా గ్రామంలోకి వచ్చేసే అమ్మవారిని మళ్లీ పొలిమేరకు గ్రామస్తులంతా సాగునంపుతారు. దాదాపు ప్రతీ ఇంటి నుంచి గ్రామస్తులు వచ్చి చీర, సారె పెట్టి అమ్మవారిని సాగనంపే కార్యక్రమాన్ని ప్రతీ రెండేళ్లకోసారి పెద్ద ఎత్తున పండగగా నిర్వహిస్తుంటారు. మరిడమ్మ ప్రతిరూపంగా చెక్కబొమ్మను తనసోదరియైన అడవివరంలోని గాంధీనగర్‌లో ఉన్న పైడితల్లి సతకం పట్టు వద్దే అప్పటికప్పుడు తయారు చేస్తారు. అక్కడి నుంచి పాత గోశాల వద్ద ఉన్న పొలిమేర దాటించి శ్రీనివాసనగర్ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్దకు చేర్చుతారు. అలా అమ్మవారి చెక్క బొమ్మను పొలిమేరకు సాగనంపే క్రమంలో అనేక దుష్టశక్తులు అమ్మవారిని ముందుకు సాగనీయకుండా అడ్డుపడుతుంటాయి. పొలిమేరకు చేరనీయకుండా వెనక్కి నెట్టేస్తుంటాయి. దీంతో గ్రామస్తులంతా అమ్మవారి వద్దకు ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఈటెలు, కర్రలతో వలయంగా పెట్టి పొలిమేరకు చేర్చుతారు. ఈక్రమంలో దారిపొడవునా గ్రామస్తులు అమ్మవారికి పసుపునీళ్లతో స్వాగతం పలుకుతారు. పొలిమేర వద్ద ప్రదక్షిణ చేస్తారు. అమ్మవారిని ఆలయంలో అధిష్ఠంపజేసిన తర్వాత వెంట తీసుకొచ్చిన చీరలు, పండ్లు, పసుపు కుంకుమలు సమర్పిస్తారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఈఏడాది అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారి పూజారి వంశీయుడు లండ వెంకట రమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. శ్రీనివాసనగర్ సమీపంలోని ఆలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకట్రావు తెలిపారు. పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు.దారి పొడువునా విద్యుత్ తోరణాలు అమర్చారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాదం అందిస్తున్నట్టు తెలిపారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా పిలుపునిచ్చారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు



బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్



వ్యర్థాలను ఏరివేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ తదితరులు

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్‌క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎస్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.జానకీ రామ్ తదితరులు ప్రసంగించారు. 250 మందికి పైగా వలంటీర్లు పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేశారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లాకు చెందిన కిల్లో లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మెషేక్ అనే ఇద్దరు యువకులు ఒడిశా నుంచి గంజాయి తీసుకు వచ్చి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారు. అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాద్దరినీ విచారించి, వారి బ్యాగ్‌లో తనిఖీ చేసి చూడగా రెండు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులను అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

సిరుల తల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళాల నడుమ అమ్మవారు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు వరం బాలసదనం



వసతి గృహం లోపల విశాల ప్రాంగణం



బాల సదనం వసతి గృహం

- 12లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం

భీమునిపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు భీమిలిలోని బాల సదనం వసతి గృహం వరంలా మారి ఆదుకుంటోంది. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వసతి గృహంలో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, నిరుపేదలు, దివ్యాంగుల పిల్లలకు కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 30 ఖాళీలు ఉండగా ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడ చేరే వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బాలసదనంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. బాలసదనంలో చేరి చదువుకునే పిల్లలకు విశాలమైన ప్రాంగణంతోపాటు మంచి గదులు, అందులో మంచాలు ఉంటాయి. బాలికలకు దుస్తులు, పౌడర్ డబ్బాలు, సబ్బులు, ఇతర అవసరాలకు సంబంధించినవి అందిస్తారు. అలాగే విజ్ఞానానికి సంబంధించిన చక్కని పుస్తకాలతో చిన్న గ్రంథాలయం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుకునే సదుపాయం ఉంది. ఇక్కడ యోగా కూడా నేర్పుతారు. బాలసదనంలో సూపరింటెండెంట్‌తోపాటు మ్యాట్రిన్, హెల్పర్, స్టోర్ కీపర్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, యోగా టీచర్, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరంతా పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారు. ఇక్కడ చేరాలనుకునే వారు పూర్తి వివరాల కోసం బాలసదనం సూపరింటెండెంట్ కె.ప్రమీలను 7893514460లో సంప్రదించవచ్చు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



యుటిలిటీస్ విభాగం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు, కార్మికులు విభాగాధిపతి కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. విభాగంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఉమా కన్‌స్ట్రక్షన్‌లో 33 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టకపోవడంతో కార్మికు లు ఇబ్బంది పడుతున్నారన్నారు. సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విభాగాధిపతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణ, శంకరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతోపాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

- శ్రీవారి ఆలయంలో రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. 750 గ్రాముల కళ్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు గల సాధారణ లడ్డూ రూ.50లకు భక్తులకు విక్రయించారు. ఇక్కడ కూడా భక్తులు బారులు తీరారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: స్వర రాగం అండ్ మెలోడి ఫ్యూజన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది. సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రమేష్, ఎన్.ఎస్.రావు ఆధ్వర్యంలో గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు.